# చేదు నిజం

## ఊరి పేరు సిరిపల్లె

సిరిపల్లెలో సిరి మాత్రమే కాదు. సంపదా వుంది.

సిరి సంపదలతోపాటు దారిద్ర్యమూ, దైన్యమూ కూడా మేట వేసే వున్నై.

ఊళ్లో ఐదు వేల గడప వుంది. ఊరికి ఒక చివర ఏరూ, రెండో చివర గూడెమూ వున్నై.

ఈ నడుమదాకా ఊళ్ళో తగిలీళ్లు లేవు.

మనుషుల ఆలోచనల్లోనూ ఏ పొరపొచ్చాలూ లేవు.

పెద్దరెడ్డిగారి భవంతికి కోటేశుగాడి గుడిసె లోకువగానే వుంది.

ఎటొచ్చీ —

మొన్నీమధ్య ఓట్ల పండగ వచ్చింది.

మొహర్బానీ నవ్వుల్ని పులుముకున్న మొహాల్నీ, రెండు అరచేతులూ అంటుకుపోయిన చేతుల్నీ, టోపీల తలల్నీ - ఊళ్లోకి తెచ్చింది.

రేపు పండగననగా – ఈ రాత్రి ధన కనక మాలక్ష్మి సంచుల్లోకి వొదిగిపోయి, వయ్యారంగా కార్లల్లో ప్రయాణం చేసి, ఘల్లు ఘల్లున గజ్జెలందియల్ని మ్రోగించుకుంటూ వచ్చింది.

మర్నాడు —

ఊరు కళకళ లాడింది.

ఆరు ఋతువులూ ఒక్కసారే వొచ్చినట్లు – ఇళ్లు అలుక్కున్నారు జనం. ప్ర. సా. దు. దగ్గర పండగా చేసుకున్నారు.

ఆ మర్నాడూ, ఆ తర్వాతి రోజూ – ఊరు ఉత్సాహంగానే వుంది.

నాలుగోరోజు రాత్రి —

ప్రకృతి విశ్రాంతి తీసుకుంటున్నది. తల్లి ఒడిలో పిల్ల వెట్టగా పడుకుని పాలు కుడుస్తున్నది. మనిషి శారీరక శ్రమ నిద్రకు దాసోహమన్నది.

అర్ధరాత్రి దాటింది.

హఠాత్తుగా గూడెం అంటుకుంది. హాహాకారాలూ, కార్చిచ్చులూ, ఆర్తారవాలూ, భయం పుచ్చులూ.

ఎవరెవరు ఎందుకెందుకు పరిగెత్తుతున్నారో తెలీదు. అంతా ప్రళయ ఘోష ; అరణ్యరోదన !

తెల్లవారింది.

బడుగు బ్రతుకులు తెల్లవారిపోయాయి. మొండిగోడలూ, బండ గుండెలూ మిగిలేయి.

దండయాత్ర ముగిసిన మరుక్షణం కనిపించే కోట ప్రాంగణంలా వుంది గూడెం యావత్తూ.

యంత్రాంగమూ, మంత్రాంగమూ కదిలేయి. అతి కష్టం మీద కొన్ని కడవల నీళ్ళు దొరికేయి. అవలీలగా, ఉచితంగా కొన్ని చెరువుల మొసలి కన్నీళ్ళూ లభించేయి జనానికి.

కొందరు ప్రమాదవశాత్తు జరిగిందన్నారు. ఇంకొందరు కావాలనే కక్ష తీర్చుకున్నారని బల్ల గుద్ది చెప్పారు. మరి కొందరు 'డబ్బు తిని ద్రోహం చేసినందుకు తగిన శాస్తి జరిగింద'ని మెటికలు విరిచారు.

విచారణ జరిగింది కానీ, ఆ నివేదికలో ఏముందో ఎవరికీ తెలియరాలేదు.

రోజులు భారంగా గడుస్తున్నాయి.

ఊళ్లో కుమ్మపొగ పెట్టినట్టే వుంది.

ఊళ్లో మనుషులు ఒబ్బిడంగా వుండటం లేదు.

ఊరు మందు దట్టించిన క్వారీగా మారిపోయింది.

యువరక్తానికి పళ్ళు బిగపడుతున్నై.

ముదుసళ్ళ మూగ కళ్ళు హెచ్చరిస్తున్నై.

వాతావరణం - ఏ క్షణాన్న ఏ ఫిరంగి పేలుతుందో అన్నట్టుంది.

వారం తిరిగింది.

జీవమున్న శవాలు కాళ్ళూ చేతులు కదిలించడం ప్రారంభించేయి.

మరో వారం వంటా వార్పూ వానగూడటంలో గడిచింది. గూడెం మనుషులు గూడూ కుండా చేరదీసుకున్నారు.

కథలో మలుపొచ్చింది.

పత్రికల్లో ఖండన మండనలు అయినై. ఉద్ఘాటనలు జరిగినై.

వక్కాణింపులు అచ్చయినై.

ఆ తర్వాత —

ఒకరోజు,

రాజయ్య పట్నం పోయొచ్చాడు.

రాజయ్య సిరిపల్లెకి సర్పంచ్

ఆ రాత్రి - ఊరంతా రాజయ్య లోగిలి ముందు సమావేశమైంది.

"గూడేనికి కొత్త ఇళ్ళు – పక్కా ఇళ్ళు వొస్తున్నయ్." అనే ప్రకటన చేశాడు రాజయ్య. ఆ వెంటనే, దీనికోసం తానెంత కష్టపడిందీ, ఎవరెవరి కాళ్ళు పట్టుకున్నదీ చేతిలో చుట్ట వేలుని కరిచేదాకా చెప్తూనే వున్నాడు.

చెమర్చిన కళ్ళు మోడువారి గుండెలకి ఊపిరి నిచ్చాయి.

పని వెంటనే ప్రారంభమౌతుందని కూడా చెప్పేడు రాజయ్య.

తాను అంటరానితనాన్ని పూర్తిగా పారద్రోలే వరకూ కన్ను మూయననీ, గూడెం జనం తన సహోదరులనీ, వాళ్ళ కష్టాలూ కన్నీళ్ళూ తనవే అనీ, తాను అస్పృశ్యతా నివారణ ఉద్యమానికి పునరంకితమౌతున్నాననీ శపథం కూడా చేశాడు.

జనం చప్పట్లు కొట్టారు.

చంద్రయ్యా, దాసు చప్పట్లు కొట్టలేదు, సరిగదా మొహం పక్కకి తిప్పుకుని పెదవి విరిచేరు.

చంద్రయ్యా, దాసు - చదువుకున్న యువకులు. చంద్రయ్య గూడెంలోవాడు. చాలాకాలం క్రితం పదవతరగతి పూర్తిచేశాడు. దాసు సిరిపల్లెలోవాడే. అక్కడి ఏకైక పట్టభద్రుడు. ఇంకా ఉద్యోగం రాలేదు.

వాళ్ళిద్దర్నీ చూపుల్తోనే కాల్చుకు తిన్నాడు రాజయ్య. నెమ్మదిగా లేచి, పై పంచె సవరించుకుని మౌనంగా కాలు సాగించాడు చంద్రయ్య. అతన్ననుసరించాడు దాసు.

నాళ్ళు గడుస్తున్నై.

డొక్కలు రెక్కల్ని హెచ్చరించకుండా వుండలేవు గనుక గూడెం పనిపాటల్లో పడింది.

అప్పుడే పొద్దు వాటారింది.

పెద్దరెడ్డీ, చంద్రయ్యా, దాసూ కలిసి రాజయ్య ఇంటికి చేరేరు.

అప్పటికే ఇతర పెద్దలూ అక్కడికి చేరుకున్నారు.

గూడెంలో కొత్తగా నిర్మించబోయే ఇళ్ళని గురించిన చర్చ మొదలైంది.

ఎన్ని ఇళ్ళు కట్టడానికి తీర్మానించింది, ఒక్కొక్క దాని ఎస్టిమేట్ మొత్తమూ మొదలైన అంకెల వివరాలూ చెప్పేడు రాజయ్య.

ఆయన చెప్పిన దానికి సరే అన్నారు పెద్దరెడ్డి, ఇతర పెద్దలూ.

దాసు నసిగేడు ; "ప్రభుత్వంవారి గ్రాంట్లు వగైరా మీరు పంచాయతీ మీటింగులోనే చెప్పేరు. వాటి అన్నింటికీ తీర్మానాలూ వున్నై. వాటి గురించే మళ్ళీ మళ్ళీ మాట్లాడు కోవడం ఎందుకు గానీ, నేను చెప్పిన సలహా గురించి ఏం ఆలోచించారు ? "

ఆ సలహా ఏఁవిటా అని అందరూ మొహమొహాలు చూసుకున్నారు.

రాజయ్య ఇరకాటంలో పడ్డాడు. ఆయనకి చాలా చిరాకేసింది.. అయినా తమాయించుకున్నాడు. నెమ్మదిగా అన్నాడు ; " గూడెం జనానికి ఎటూ పక్కా ఇళ్ళు కట్టిస్తున్నారు కదా - వాటిని ఇప్పుడున్న గూడేనికీ మన ఊరికీ మధ్యలో కట్టించమనేది వీళ్ళ సలహా. "

అందరూ ఆలోచనలో పడ్డారు.

" అవును. గూడేన్ని ఈ విధంగా ఊరికి దగ్గరికి తీసుకొస్తే బాగుంటుందని మా అభిప్రాయం. " చంద్రయ్య చెప్పేడు.

" అది సరేనయ్యా. నీ సలహాకి సవాలక్ష అటంకాలు వున్నై. ప్రభుత్వంవారు పక్కా ఇళ్ల పథకాన్నొకదాన్ని

తయారు చేసి ఇచ్చారు. దాన్ని మనం ఆచరణలో పెట్టాల్సిందే. మళ్లీ ఇలాంటి సలహాలు చెప్తే, అనేకమంది ఆఫీసర్లూ, అనేక డిపార్టుమెంటులూ తిరిగి ప్రభుత్వానుమతి పొందాలి. ఇదంతా అయ్యేసరికీ ఏళ్ళు గడుస్తయ్."

"ఈలోగా బీదా బిక్కీ నానా అవస్థా పడతారు." పెద్దరెడ్డి తానూ రాజయ్యకు సుముఖుణ్ణేనని తేల్చేడు.

మిగిలిన తలలు అవునని వూగిన్నై.

తర్జన భర్జనలు సాగి సాగి అర్ధరాత్రిని పలకరించాయి.

చంద్రయ్యా, దాసు ఇంటిముఖం పట్టి, కొంతదూరం నడిచి దారి మళ్ళించి - ఏటి గట్టుకి నడక సాగించారు. ఆ రాత్రంతా ఇద్దరూ ఎన్నెన్నో పథకాలు వేశారు. ఏవేవో ఆదర్శాల గురించి మాట్లాడుకున్నారు. నింగీ నేలా నీరూ వాళ్ల ఊసులన్నీ విని సన్నగా నవ్వుకున్నై.

మర్నాడు - పగలు పదిగంటలైంది.

ఎండ చిట చిట లాడుతోంది.

ఊరూ, గూడెమూ రాజయ్య ఇంటి ముందు కొచ్చింది.

రథసారథిలా దాసు - వెనగ్గా జనం.

"కావల్సిన పనులన్నీ మేం చేయించుకొచ్చుకుంటాం. మా సలహా వినండి." చంద్రయ్య కంఠం ఖంగున మ్రోగింది.

పెద్దలంతా గుసగుసలు పోయారు.

క్షణాలు గడిచిన్నై.

"వినండి ... ఒక్కమాట" - అని ప్రజల్ని హెచ్చరించి చెప్పసాగేడు, దాసు.

" చంద్రయ్య సలహాకి తోడూ, నాదీ ఒక సలహా వుంది. మన ఊళ్ళో పంచాయతీ గ్రంథాలయం, రీడింగ్ రూమ్ కట్టడానికి తీర్మానించారు. దాన్ని రాజయ్యగారి ఇంటిని అనుకుని వున్న స్థలంలో కట్టిద్దామనుకున్నారు గదా ! దాన్ని గూడేనికి నిర్మించే పక్కా ఇళ్ల మధ్యలో కట్టించండి. మీరు కూడా ఆ విధంగా గూడేనికి దగ్గరౌతారు. " దాసు ఆగేడు.

" మీరంతా కాకపోయినా – మీ పిల్లలు తప్పకుండా దగ్గర అవుతారు. ఎందుకనంటే మీలో జీర్ణించుకుపోయిన భావాల కారణంగా మీరు అంత త్వరగా మారి అక్కడ కట్టే రీడింగ్ రూమ్‌కి పోక పోవచ్చు. కానీ, రేపటి వైపు చూపులు సారించే యువతరం దీన్ని మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తుంది. దాసు చెప్పిన సలహా చాలా బాగుంది. " చంద్రయ్య వివరించేడు.

రాజయ్య ఏదో చెప్పబోయేడు.

కానీ,

అప్పటికే జనంలో నుంచీ మాటలు దూసుకు రాసాగేయి ; " దాసు సూచనని పాటించాలి, చంద్రయ్య సలహా బాగుంది... బాగుంది " అంటూ.

రాజయ్య, పెద్దలూ పరిస్థితిని గమనించేరు.

తరతరాల అహం, స్వార్థం – పరిణామానికి గింజుకో సాగేయి.

ఆ రోజూ, పగలూ రాత్రీ ఆలోచనలతో మేధస్సుని మండించుకున్నారు, ఊరి పెద్దలు.

ఆ తర్వాత పదిరోజులపాటు టెలిఫోన్‌లు మ్రోగేయి.

కార్లు పరిగెత్తేయి.

ఈ పదిరోజుల్లోనూ దాసుని రెండుసార్లు తన లోగిలికి పిలిపించాడు రాజయ్య. రెండు మూడు సార్లు తానే దాసు ఇంటికి వచ్చి వెళ్ళేడు.

చంద్రయ్య దాసుని కలుసుకుని భవిష్యత్ కార్యక్రమం గురించి మాట్లాడబోతే — తానేవో వేరే పనుల్లో మునిగి వున్నట్టు చెప్పి జారుకున్నాడు దాసు.

ఓ శనివారం — కనుచీకటివేళ,

కరణంగారి నిమ్మతోటకి ఏతామేసి తిరిగొస్తుంటే చంద్రయ్యకి చింతల తోపులో రాజయ్య తటస్థపడ్డాడు. ఆయన పక్కన కబుర్లు చెప్తూ నడుస్తున్నాడు దాసు.

మళ్ళీ శనివారం వచ్చింది.

దాసుతో వివరంగా మాట్లాడదామని వూళ్ళోకి వెళ్ళాడు చంద్రయ్య. అతని ఇల్లు తాళం వేసి వుంది.

అనేక రకాల ఆలోచనలతో వెనుదిరిగాడు చంద్రయ్య.

దారిలో పెద్దరెడ్డి కనిపించాడు. దాసు సంగతి అడిగేడు చంద్రయ్య. పెద్దరెడ్డి చెప్పింది విని నిర్ఘాంతపోయాడు చంద్రయ్య.

'నిన్న సాయంత్రమే దాసు పట్నం వెళ్ళిపోయాడనీ, రాజయ్య సాయంతో అతనికి ఏదో కార్పొరేషన్‌లో మంచి ఉద్యోగం వచ్చిందనీ' — గ్రహించడానికి ఎంతోసేపు పట్టలేదు చంద్రయ్యకి.

గాలికి కొట్టుకుపోయిన పేలపిండి చంద్రయ్యని వెక్కిరిస్తోంది!

0₀0